మెరకచేను

తాళ్లూరు నాగేశ్వరరావు

"మెరకచేను బేరం ఇచ్చేశాను" అన్నాడు రామసుబ్బయ్య అప్పుడే బజార్నుంచివొచ్చి, నేరుగా పెరట్లో రాతి గోళెం దగ్గరకు వెళ్ళి-కాళ్లూ చేతులూ కడుక్కుంటూ.

వంట గదిలో పీట వాల్చి, రాగి చెంబుతో మంచి నీళ్లు పెడుతూన్న భార్య లక్ష్మీకాంతమ్మ ఆ మాటలు విన్నది. కాని వెంటనే వ్యాఖ్యానం విసర లేదు.

జామచెట్టు కొమ్మకు తగిలించియున్న తుండు గుడ్డతో కాళ్లూ, చేతులూ తుడుచుకొని—వంట గది వసారా ముందు నిలబడి భార్యకేసి పరిశీలనగా చూశాడు. తెల్ల సిల్వర్ పళ్లెంలో అన్నం పెట్టి, జాడీలోంచి ఎర్ర కారపు పచ్చడి తీసి పళ్లెంలో వేసి, చిన్న మట్టిగిన్నెలో దోసకాయ తోడు కూర పెట్టి, నేతిగిన్నె ప్రక్కనుంచి భర్త కేసి చూసింది లక్ష్మీకాంతమ్మ.

ఆయన పీటమీద మునిగాళ్లమీద కూర్చుంటూ —"మెరకచేను బేరం ఇచ్చేశాను" అన్నాడు నేరం చేసినంత భయంగా.

ఆవిడ మూతి వంకాయ తొడిమెలా పెట్టి 'ఎవరికి ?" అన్నది.

"వెంకటకృష్ణయ్యకు—"

"మరెవరి కిస్తావులే ? అన్నాట్టు కనుబొమలు ఎగురవేసి. ఎంతకు?" అన్నది.

"పదకొండు వేలకు" అన్నాడు రామసుబ్బయ్య తల వంచుకుని తెల్లటి అన్నపు మెతుకుల్లో ఎర్రటి పచ్చడి కలుపుకుంటూ.

లక్ష్మీకాంతమ్మ మొహంపై ఆశ్చర్యం గాలికి తెరచాపవలె రెపరెప లాడింది.

"బంగారంలాంటి రెండెకరాల మెరకచేను పదకొండు వేలేనా ? వెంకటకృష్ణయ్య ఎంత స్నేహితుడైతే మటుకు పొలం అంత చవగ్గా యిచ్చుకుంటారా ? అబ్బాయి చదువుకు అవసరమై మనం పొలం అమ్మజూపడ మేమిటి ? కుళ్లి పోయిన కూరగాయులకు మల్లే తక్కువకు బేర మివ్వడ మేమిటి ? డబ్బు ముందు స్నేహాలూ, బంధుత్వాలూ చూసుకుంటే—వ్యవహారం వెల్లకిలా బడ్డట్టే !"

"అంత తేలిగ్గా మాట్లాడకు. డబ్బుమీద నీకంటే నాకు తక్కువ అపేక్షేమీ లేదు. అసలు నాకా మెరకచేను అమ్మట మంటేనే—ప్రాణం ఎగిరిపోతున్నట్టుంది. ఏం చేస్తాం ? తప్పనిసరి అవుతూన్నది. ఈ రెండేళ్లూ అబ్బాయికి చదువు చెప్పించామంటే—డాక్టరీ ప్యాసై, ఆ తర్వాత వాడే మనల్ని సుఖపెడతాడు. ఏమైనా ఇప్పుడు అర్జంటరంగా పొలం అవమ్మాలంటే—ధర ఎట్టా పలుకుతుంది ? అవసరాన్నిబట్టి కొనేవాడికి అమ్మేవాడు లోకువే. వెంకటకృష్ణయ్యకు చేనులో చేను కలుస్తుంది కాబట్టి ఆపాటి ధర పెట్టాడు."

"పూరి మొత్తానికి మన మెరకచేను గైరు. నిరుడు అందరి చేలూ వాన దెబ్బకు తాలూ తప్పా వేసి సగానికి సగం కూడా పండకుండా పోయినా మన మెరకచేను ఎకరానికి ఇరవై బస్తాలకాడికి రాలింది. నిక్షేపంలాంటి ఆ మాగాణి ఎకరం అంబదున్నర వేలండీ—ఎవ్వరైనా నవ్విపోతారు.

అమ్ముకోవడం చేతకాకపోతే సరి. మొన్న అంకయ్యగారి సూరయ్య అడవి పొలమే అయిదువేలు చేసి అమ్మలేదూ! ఆ లెక్కన మన పొలం ఎకరం ఏడువేలు చేస్తుంది."

'ఏడువేలేం ఖర్మ, పదివేలు చేస్తుంది—కొనే నాథుడే ఉంటే!" ఎగతాళిగా అన్నాడు రామసుబ్బయ్య ఎర్ర కారపు పచ్చడి కారం నాలుక్కపై కరకర లాడగా.

"అయితే మెరకచేను మొత్తం మూడు వేలకే అమ్మేసేయండి. నాకెందు కొచ్చింది?" కోపంతో ముక్కు, పెదాలు గజగజ లాడగా—మజ్జిగ తపేళా ముందు పెట్టి, వంటగది యివతల కొచ్చింది లక్ష్మీకాంతమ్మ.

మజ్జిగ పోసుకోకుండానే—పీటమీదనుంచి లేచాడు రామసుబ్బయ్య.

"రామసుబ్బయ్యా!" ఇంటిముందు వసారాలోంచి కేక వినబడింది.

రామసుబ్బయ్య ఇంట్లోంచి వసారాలోకి వచ్చాడు. పెద్ద అరుగుమీద షావుకారు చంద్రశేఖరమూ, ఆయన నమ్మినబంటు గణపతీ కూర్చున్నారు. ఎందుకో రామసుబ్బయ్య మనస్సు వాళ్లను చూడగానే కళుక్కుమన్నది. వాళ్లకేసి తేరపార జూసి, ప్రక్క జేబులోంచి పొగాకు కాడ తీసి—పాయలుతీయ నారంభించాడు.

"మెరకచేను అమ్మజూపావంటగా" అన్నాడు గణపతి గంభీరమైన మీసాల్లోంచి దోరగా నవ్వుతూ.

"బేరం ఇచ్చేశాను" ముక్తసరిగా అన్నాడు రామసుబ్బయ్య.

"బయానా తీసుకోలేదుగా."

రామసుబ్బయ్య మాట్లాడలేదు. గడపమీద కూర్చుని చుట్ట చుట్టుకో మొదలెట్టాడు.

షావుకారూ, గణపతీ ఒకళ్ల ముఖాలకేసి ఒకళ్లు చూసుకున్నారు.

రోహిణి కార్తె ఎండ పదకొండు గంటలకే శాఖ చూపిస్తోంది.

లక్ష్మీకాంతమ్మ వంటగదిలోవి ఎంగిళ్లు తీసివేసి, పైటచెంగుకు చేయి తుడుచుకుంటూ వచ్చి, మండిగం ప్రక్కనే నిలబడింది.

"మెరకచేను మొత్తం పదిహేను వేలకు తీసుకుంటా మంటున్నారు షావుకారుగారు. మీ కిష్టమైతే ఈ మాసంలోనే రిజిష్టరు కూడా చేసుకోవచ్చు." అన్నాడు గణపతి బీడీ వెలిగిస్తూ.

షావుకారు చంద్రశేఖరంగారు అవునన్నట్టు పొడిదగ్గు దగ్గారు.

లక్ష్మీకాంతమ్మ మనస్సు సంతోషాతిశయంతో నీళ్లు నిండిన చెరువైంది.

కాని, రామసుబ్బయ్య ముఖం నిప్పు సెగ తగిలిన పచ్చని చెట్టు పగిది కమిలిపోయింది.

"బేరం ఖరారైంది. ఇప్పుడు మాట తప్పలేను." రవ్వంత బెసక్కుండా అన్నాడు రామసుబ్బయ్య.

"బేరంలో బయానా పుచ్చుకుంటేనే ఖరారైనట్టు. మాటల్ని ఏ క్షణంలోనైనా మార్చుకోవచ్చు." అన్నాడు గణపతి.

"ఆయన మాటలకేంలే అన్నయ్యగారూ! సంపాయించేది లేకపోయినా, ఉన్నది వూడ్చుకోవటమే చాతనవును. నాలుగువేల రూపాయలు ఎక్కువ వస్తుంటే ఎవ్వరైనా కాలితో పోగొట్టుకుంటారా? ఆ మెరకచేను మీరే తీసుకోండి—పదిహేను వేలకు" అన్నది లక్ష్మీకాంతమ్మ కల్పించుకొని.

తోక త్రొక్కిన త్రాచులా భార్యకేసి చూశాడు రామసుబ్బయ్య.

లక్ష్మీకాంతమ్మ జంకలేదు.

"వ్యవహార సరళిలో మాట్లాడా వమ్మాయీ! డబ్బు విలువ మగవాళ్లకంటె ఆడవాళ్లకే ఎక్కువ తెలుసు. బయానా ఇవ్వమంటావా, ఓ వెయ్యి రూపాయలు రామసుబ్బయ్యా!" అన్నాడు గణపతి లౌక్యంగా.

"ఊళ్లో నా పరువు ప్రతిష్ఠల్ని మొదలంటా తీసేసేట్టున్నారు. పొలం ఒకళ్లకు బేరం యిచ్చి—ఎక్కువ ధర వొస్తుంది గనుక, మీకు అమ్మమంటారా? ఎంత అన్యాయం? వూళ్లో నలుగురూ నా మొఖాన ఉమ్మేయ్యరూ! నేనూ చీమూ, నెత్తురూ గలవాడ్నే." అన్నాడు రామసుబ్బయ్య రోషంగా.

ఆ మాటలు షావుకారు గారికి కోపకారణాలయ్యాయి. చివుక్కున లేచి "ఆలోచించుకో" అని బయటకు నడిచాడు. తల ఆడిస్తూ గణపతి కూడా అనుసరించాడు.

మండిగం ఇవతలకొచ్చి, లక్ష్మీకాంతమ్మ భర్తపై మట్టిఅడుసు విరుచుకుపడ్డట్టు విరుచుకుపడింది.

"మీలాంటి మొండి మనుష్యుల్ని నే నెక్కడా చూడలేదు. లోకంలో ఎవరైనా డబ్బు వొస్తుంటే—మోకాలు అడ్డ పెడతారా? ఎంత విడ్డూరం? మీ హయాములో దమ్మిడీ సంపాయించలేదు. పైపెచ్చు పిత్రార్జితం అమ్ముకుంటూ రావటమే! మెరకచేనుకు పదిహేనువేలొస్తే—నాలుగైదు వేలు అబ్బాయి చదువుకు ఖర్చయినా, రెండెకరాల గరువు కొనుక్కోవచ్చు. ఆమాత్రం ముందు చూపు మీకెట్లా లేకపోయింది. అసలు నన్ను అడక్కుండా పున పున బేర మెందు కిచ్చారు? ఇస్తే మటుకు మాటకు కట్టుబడి ఉండాలనేదేముంది? దేశంలో ఎన్ని బేరాలు మాటల్లోనే తప్పిపోవటంలేదు. మీరేమైనా కలియుగ సత్య హరిశ్చంద్రులా! ఆ మెరకచేను షావుకారుగారికే అమ్మండి. లేకపోతే నేను బావిలో దూకి చస్తాను."

* * *

షావుకారు చంద్రశేఖరమూ, ఆయన ఉప్పు తింటూ రొమ్ము విరుచుకు తిరిగే గణపతీ, రామసుబ్బయ్య ఇంటికి వెళ్లి—మెరకచేనుకు ధర పెంచినట్లు ఆరోజు మధ్యాహ్నమే వెంకటకృష్ణయ్యకు తెలిసింది. షావుకారు స్వభావానికి యిష్టపడ్డాడు.

సూర్యుడు అటు వాలాక, కోటినాగులు కాల్వొనా వద్ద కనపడ్డ రామసుబ్బయ్యను ప్రక్కకు పిల్చి, మెరకచేను విషయం ఎత్తాడు వెంకటకృష్ణయ్య.

మనస్సులోని బాధనంతా బయటపెడుతూ జరిగిన సంగతంతా చెప్పాడు రామసుబ్బయ్య. ఆమీదట వెంకటకృష్ణయ్య "షావుకారు చంద్రశేఖరం బుద్ధి మనకు తెలియనిది కాదు. ప్రతి బేరంలోనూ తలదూర్చి, వ్యవహారాన్ని చెడగొట్టడం తప్పుదోవ పట్టించడం—ఆయనకు సరదా. ఆ పాడు బుద్ధి ఉండబట్టే, లక్షాధికారియైనా వూళ్లో చిన్న మెత్తు విలువ లేదు. అయినా అవతల నీకు నాలుగువేలు లాభం వస్తుంటే, నేను పట్టుపట్టటం దేనికి? షావుకారుకే అమ్ము మెరకచేను. పదిహేను వేలంటే—మంచి ధరే. అంత మొత్తంతో నేను కొనలేను" అన్నాడు.

షావుకారు తన ఇంటికి వచ్చి, ధర పెంచడంతో ఆరంభమైన ఆత్మసంఘర్షణ రామసుబ్బయ్యలో ఆరని చుట్టకు మల్లే పొగల్ని చిమ్ముతూనే ఉంది. వెంకటకృష్ణయ్య చిన్ననాటి మంచి స్నేహితుడు. ఇద్దరూ ఒక జట్టుగా గోటికాయలాడేవాళ్లు, కాలువలో ఈతగొట్టేవాళ్లు, బీడులో పశువుల్ని తోలుకెళ్లి మేపేవాళ్లు, చెడుగుడు ఆడేవాళ్లు, నాటకాలు వేసేవాళ్లు. పెద్దవాళ్లు అయినాక కూడా ఎంతో కలిసి మెలిసి ఉండేవాళ్లు, ఒకళ్లకొకళ్లు అప్పులిచ్చుకుంటూ, తీర్చుకునేవాళ్లు. పొలంపనుల్లో పాయితాలు చేసుకొనేవాళ్లు. ఎంతో స్నేహంగా, ఆప్యాయంగా, పూర్వానుబంధంగా, ఒక తండ్రి బిడ్డల్లాగా ఉంటూ ఉండేవాళ్లు. అట్లాంటి ఆత్మీయత ఇద్దరిమధ్యా స్పష్టమైన రూపాన్ని ధరించాక—ఇచ్చిన మాట తీసికోవడ మెట్లా? పైగా వెంకటకృష్ణయ్యకు చేనులో చేను. ఆ ధరకు తను ఒప్పుకున్నాడు. బయానా ఇస్తానన్నా—తను తీసుకోలేదు. 'మన మధ్య కూడా బయానా ఏమిటి? మనుషుల్లో అప్పుడే నమ్మకాలు జారిపోతున్నాయా?' అన్నాడు తను. ఆ మాటల్నీ, స్నేహాన్నీ, ఆత్మీయతనూ—వెధవది డబ్బు ముందు మర్చిపోయి, నీచంగా, స్వార్థంగా, నగుబాటుగా ఎట్లా ప్రవర్తించటం? 'ఆడి తప్పాడు', 'నిలకడలేని మనిషి', 'హెచ్చు ధర కోసం పాలుమాలాడు' అనుకుంటారు. భార్య సలహా వింటే ఆవిడకు దడిస్తే — ఊళ్లో తనకు గడ్డిపోచ పాటి చెల్లుబడి కూడా ఉండదు ...... రామసుబ్బయ్య తీవ్రంగా ఆలోచించుకున్నాడు.

"వెంకటకృష్ణయ్యా నేను హెచ్చు ధరకోసం ప్రాకులాడేవాడ్ని కాదు. నీకు మాట యిచ్చి తప్పుకుంటానా? మా ఆడది ఏడ్చి ఏడు రోజులు ఉపవాసమున్నా—మెరకచేను నీకే యిస్తాను" అన్నాడు రామసుబ్బయ్య గుండెపట్టు నిలదొక్కుకుని.

వెంకటకృష్ణయ్య మిత్రునికేసి పరకాయించి చూశాడు. ఆయన గుండె ధైర్యాన్ని, ముఖపు తీరునూ, స్నేహం కోసం వేటిని ఖాతరుచేయని తత్వాన్నీ గ్రహించాడు.

"ఈ బేరం మూలకంగా మీ కుటుంబంలో భేదాభిప్రాయాల్నీ, అలజడినీ, పోట్లాటల్నీ, ఏడ్పులనూ నేను సహించను రామసుబ్బయ్యా! నువ్వు మెతక మనిషివి కావని నాకు తెలుసు. కాని ముక్కుకు సూటిగా, మూర్ఖంగా ప్రవర్తించటంవల్ల వ్యవహారాల్లో చిక్కు లేర్పడతాయి. తద్వారా సంసారంలో అశాంతి రేకెత్తడం శ్రేయస్కరం కాదు. సముద్రపుటలలకు తల వంచడం వల్ల మేలు. నిటారుగా నిలబడితే ముఖానికి దెబ్బ తగలక మానదు. అల్లాగే పరిస్థితులకు తల యొగ్గడం సముచితం. కుటుంబంలో తాత్కాలికంగా ప్రమాదాల నుంచి బయటపడొచ్చు. మనలో బలహీనత లేకపోయినా, ఇతర్ల బలహీనత ప్రభావాల్ని మన్నించక తప్పదు. నువ్వు షావుకారుకు పొలం అమ్మినా—నేను బాధపడను. నిన్ను గురించి

36 వ పేజీ చూడండి

ఊఁవుఁహాఁ

ఒక టీ చెంచాడు వుడ్‌వార్డ్స్ 'గ్రైప్‌వాటర్' ఇస్తే చాలు మీ శిశువు ఏడుపు మాని...సుఖంగా నిద్రించును!

శిశువుల జబ్బులు—వాయువువల్ల కడుపు ఉబ్బరం, పళ్లు చేయునప్పుడు జబ్బులకు, వుడ్‌వార్డ్స్ మాత్రమే సమకూర్చగల నివారణ కావలెను. వంద ఏళ్లకు మించి తల్లులు వుడ్‌వార్డ్స్ వాడుచూ శిశువులను పుష్టికరంగా పెంచియున్నారు.

వుడ్‌వార్డ్స్

'గ్రైప్ వాటర్'

ప్రపంచమంతటా 100 ఏళ్లనుంచి వాడబడుచున్నది.



అధికారయుత ఏజెంట్లు: హెర్బర్ట్స్ సన్స్ లిమిటెడ్., బొంబాయి, కలకత్తా మరియు లక్నో • టి.టి. క్రిష్ణమాచారి అండ్ కొ., మద్రాస్ • ఎమ్.జి. షహాని అండ్ కొ., (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ.

Aiyars AT 341-TL

మెరకచేను

19 వ పేజీ తరువాయి

అన్యధా భావించను. నీ మనస్సు నాకు తెలుసు. నీ అవసరం నాకు తెలుసు. నీ పరిస్థితులు నాకు తెలుసు. పోనీ, ఒకపని చేయగూడదూ! ఈ మెరకచేను అమ్మడం మీ అబ్బాయి చదువు నిమిత్తమే గదా! ఓ అయిదువేలు ఇస్తాను—చేబదులుగా. వడ్డీ వద్దు. నోటు కూడా వద్దు. మీ అబ్బాయి చదువు పూర్తి అయినాక, సంపాదనలో తీర్చు. ఆపదలో ఆదుకోవడం కంటె స్నేహధర్మమేముంది? ఈ పద్ధతే మెరుగ్గా ఉంటుంది. మెరకచేనుమీద నీకున్న మమకారం నాకు తెలియనిది కాదు. ఇప్పుడు నువ్వు మెరకచేను అమ్మితే—మళ్లీ రేపు డబ్బులు మెదిలాక కొనాలంటే ఎవరమ్ముతారు?''

వెంకటకృష్ణయ్య మంచితనానికి, అమూల్యమైన సలహాకు, ఉదార స్వభావానికీ రామసుబ్బయ్య దిగ్భ్రమ చెందాడు. మనస్సులో చేతులెత్తి దణ్ణంపెట్టాడు. కాని పైకి మొహమాటాన్ని కనబర్చాడు. అభిమానం అడ్డువచ్చినట్టు నటించాడు. ముఖాన్ని చిన్నబుచ్చుకున్నాడు.

వెంకటకృష్ణయ్య చొరవతీసుకొని, నచ్చజెప్పాడు. చివరకు రామసుబ్బయ్య అయిదువేలు చేబదులుగా పుచ్చుకునేందుకు అంగీకరించి, మెరకచేను అమ్మకం మానుకొనేందుకు నిశ్చయించుకున్నాడు. ఆయన మనస్సు గోగుపుల్లకంటె తేలికపడింది. దీపాలు పెట్టాక హుషారుగా ఇంటికి వచ్చి వంటగది ప్రక్క మెరాబాలో పొయ్యిగడ్డ ముందు గంజి వారుస్తూన్న భార్యతో కాయించి అన్నాడు రామసుబ్బయ్య.

"మెరకచేను అమ్మటంలేదు."

లాటరీలో లక్ష రూపాయలు వచ్చినంతగా సంభ్రమాశ్చర్యచకితయ్యింది లక్ష్మీకాంతమ్మ. మసిగుడ్డతో అన్నపు కుండను గట్టిగా పట్టుకొనే "ఏం?" అన్నది నుదురు వెడల్పుచేస్తూ.

వెంకటకృష్ణయ్య చేస్తానన్న సహాయాన్ని సంతోషంతో వివరించి చెప్పాడు.

కూర మాడిపోయినట్టు పెదవి చప్పరించి, ౕఖం మోటుగా చిట్లించింది లక్ష్మీకాంతమ్మ.

"ఓస్! ఇదా మీ సంబడానికి కారణం! ఏదో సామెత చెబుతారే! .... చెరువులో గేదె కొమ్ముల్ని చూసి కడుపు నింపుకున్నాట్ట! వెంకటకృష్ణయ్య చేబదులుగా అయిదువేలిస్తాడట ..... వడ్డీ లేదుట ..... నోటు అక్కర్లేదట ..... ఈయనగారు చంక లెగురవేసుకుంటూ వచ్చారు. ఆయన సహాయం వెనుకనున్న స్వార్థాన్ని పసికట్టారా? లేదు. అబ్బాయి చదువుకు ఇప్పుడు అయిదువేలిచ్చి—పెద్ద ఆపదలో ఆదుకున్నట్టు, రేపు తన కూతుర్ని పెళ్లి చేసుకోమని గొంతుమీద కూర్చుంటాడు. అప్పుడు తెల్సివస్తుంది ఆయన సహాయంలోని బండారం. మీరెంత అమాయకులు? తెల్లనివన్నీ పాలు అనుకుంటే ఈరోజుల్లో అడుగు ముందు కెయ్యలేం! తిన్నగా గోతిలో పడటమే! ఆయన సహాయమూ, చేబదులూ మనకేమీ అక్కర్లేదు. షావుకారుగారికి మెరకచేను అమ్మేయండి. అంత ధర పెట్టి కొనే ఆసామి ఈ వూళ్లో లేడు."

మూర్ఛ వొచ్చినంత పనైంది. రామసుబ్బయ్యకు. వెంకటకృష్ణయ్య నిజంగా యింతముందు ఆలోచనతో తనకి చేబదులుగా అయిదువేలు ఇస్తానన్నాడా ? ఎంత స్వార్థం ? తనా కిటుకు కానలేకపోయాడు. ఆయనకు పెళ్లీడు కొచ్చిన కూతురు ఉంది. సంబంధాలు కూడా అడపా దడపా చూస్తున్నాడు. తామిద్దరి మధ్య పెరిగిన గాఢ స్నేహాన్ని బట్టే పూళ్లో—'స్నేహితు లిద్దరూ వియ్యంకులు కావచ్చు' అనుకోవటం కూడా కద్దు. వెంకట కృష్ణయ్య కూతురు బావుండదు. కారు నలుపు. ముక్కు పొడవు. మూతి కురుచ, కళ్ల లోతు, పళ్ల ఎత్తు. తన కొడుకు చచ్చి గీపెట్టినా ఆ పిల్లను పెళ్లి చేసుకోడు. అదీగాక వెంకట కృష్ణయ్య ఏపాటి కట్నం యిస్తాడు ! .... నిజంగా అది చెప్పినట్టు, తనకి ఆయన సహాయం అక్కర్లేదు. ముందు ముందు చిక్కుల్లో యిరుక్కోవాల్సి వస్తుంది. మెరకచేను అమ్మడమే మేలు. అనుకున్నాడు రామసుబ్బయ్య.

ఆ రాత్రే భోజనం చేశాక షావుకారుగారి దగ్గరకు వెళ్లాడు. "మెరకచేను అమ్ముతాను. మీరే తీసుకోండి—పదిహేను వేలకు" అన్నాడు.

షావుకారు చంద్రశేఖరం అయిష్టంగా కనుబొమలు ముడుస్తూ—"ఆఁ! ఇప్పుడు పొలం కొనదల్చుకోలేదు. నీ దగ్గర్నుంచి వచ్చాక ఆలోచించాను. గవర్నమెంటు రోజురోజుకీ ఏవో పన్నులు విధిస్తూ, బిల్లులు పెడుతూన్నది. ఉన్న పొలం జాగ్రత్తగా చేసుకుంటే చాలు. ఇప్పుడంత ఎక్కువ ధరపెట్టి కొని—నేనేం చేసికొనేది !" అన్నాడు.

రాతిగోడకు నుదురు కొట్టుకొన్నట్లయింది రామసుబ్బయ్యకు. తల దిమ్మెక్కిపోయింది వోరెత్తకుండా ఇంటికి వచ్చాడు. షావుకారు నిర్లక్ష్యంగా నవ్వుకున్న చిరునవ్వు ఆయనకు వినిపించలేదు, కనిపించలేదు.

మరునాడు ఉదయం రామసుబ్బయ్య ఏకాయెకీన వెంకటకృష్ణయ్య దగ్గరకు వెళ్లాడు. వీధి అరుగుమీద నీళ్లచెంబు ప్రక్క పెట్టుకుని, పందుంపుల్లను నోట్లో పెట్టుకుని—ఎదురుగ్గా చేతులు కట్టుక్కుని నిలబడియున్న యానాది వెంకటస్వామితో మాట్లాడుతున్నాడు వెంకట కృష్ణయ్య.

సూడు బార్ల పైకి ఎక్కిన సూర్యుడు ములగ చెట్టు కొమ్మల్లోంచి కదులుతున్నాడు. తెల్లని ఎండ వీధి అరుగుపైన పడుతోంది. రామసుబ్బయ్య రాకనూ, ఆయన ముఖంపై ప్రేళ్లాడే ఆదుర్దాను గమనించిన వెంకటకృష్ణయ్య కొంచెం సేపు ఏమీ ఎరుగనట్టే వెంకటస్వామితో—పొలం కావలిని గురించి చర్చించాడు. దరిమిలా స్నేహితుని కేసి, కనుబొమలు కదుపుతూ 'ఎప్పుడొచ్చావు ?' అన్నట్టు చూశాడు. క్రితం రాత్రి ఆదరా బాదరా రామసుబ్బయ్య పొలం అమ్ముతానంటూ షావుకారుగారిదగ్గరకు వెళ్లటమూ, షావుకారు పెడ ముఖం చూపెట్టటమూ, ఆమీదట ఆయన ముఖం ఉబ్బగా యింటికి వెళ్లటమూ—వెంకట కృష్ణయ్య చెవికి ఆ రాత్రికి రాత్రే సోకాయి. ఆ విషయం కడుపులో పెట్టుకొనే—

"ఏం సుబ్బయ్యా ! ఇంత పెందలాడే వొచ్చావు ?" అన్నాడు వెంకటకృష్ణయ్య నిర్మలంగా నవ్వటానికి ప్రయత్నిస్తూ.

రామసుబ్బయ్య నీళ్లు నమిలాడు.

"మెరకచేను నువ్వే తీసుకో."

ఎదురుగ్గా ఉన్న ములగచెట్టుకేసి, దానికి కట్టివేసి ఉన్న పాడిగేదె కేసీ చూస్తూ, వెంకట కృష్ణయ్య కొన్ని క్షణాలపాటు తీక్షణంగా ఆలోచించాడు.

"కాలం మారినంత వేగంగా మనుషులు మారతారనీ, మనస్తత్వాలు మారతాయనీ యిన్నేళ్లగా నాకు అభిప్రాయం లేదు. నీ గురించి ఇప్పుడు నిర్ధారణ చేసికుంటున్నాను. మన ఇద్దరి మధ్య పెరిగిన స్నేహమూ, ఆత్మీయతా, మమతలూ, అనుబంధాలూ—ఒకానొక సమయానికి పరీక్షకు నిలుస్తాయనీ, అపార్థాలకు అవకాశాలు కలుగుతాయనీ, ములగచెట్టు కొమ్మల్లా మనస్సులు విరిగి పోతాయనీ నేనెప్పుడూ వూహించలేదు. నువ్వు మారిపోయావు రామసుబ్బయ్యా ! నన్ను నమ్మలేదు. మన స్నేహపు విలువల్ని విశ్వసించలేదు. నా సహాయం వెనుక స్వార్థం ఉన్నదని భావించావు. నా మనస్సును అంచనా వేయలేక పోయావు. ఎండ మావుల్లాంటి ఆశలకు లోనై, అశాంతితో గాబరా పడుతున్నావు. అయినా ఇప్పుడు పొలం కొనే ఆలోచనకు స్వస్తి చెప్పాను. రాత్రి బెజవాడ నుంచి మా బావవర్ది వొచ్చాడు. హైదరాబాద్‌లో స్థలాలు చవుగ్గా దొరుకుతున్నాయట. వాటిమీద డబ్బును పెట్టుబడి పెట్టటం ఎక్కువ లాభదాయకమని చెప్పాడు. అదేపని చేద్దామనుకుంటున్నాను. నువ్వు మెరకచేను మరొకళ్లకు అమ్ముకోవటం మంచిది. నిర్మొహమాటంగా మాట్లాడినందుకు ఏమీ అనుకోకు" మళ్లీ పందుంపుల్ల నోట్లో పెట్టుకున్నాడు. వెంకటకృష్ణయ్య ములగచెట్టుకేసి చూస్తూ.

రామసుబ్బయ్యకు కాళ్ల క్రింద భూమి జవజవ లాడింది. క్షణంసేపు అక్కడ నిలువలేక పోయాడు. గబగబా ఇంటిదారి పట్టాడు.

కాని ఇంటికి వెళ్లలేదు. షావుకారు చంద్రశేఖరం దగ్గరకు వెళ్లాడు గణపతిని తోడు తీసుకొని.

* * *

పది గంటల ప్రాంతాన రామసుబ్బయ్య ఇంటికి వొచ్చాడు షావుకారు దగ్గర్నుంచి. లక్ష్మీకాంతమ్మ అరగంట నుంచి భర్తకోసం ఎదురు చూస్తూ ఉంది.

వానకు తడిసి, ఎండిన టార్పాలిన్ గుడ్డవలె ముఖం వ్రేళ్లాడవేసి కొచ్చిన భర్తకు గుమ్మంలోనే అబ్బాయి దగ్గర్నుంచి వొచ్చిన లేఖను అందించింది. ఆరిన అప్పడంలా నులకమంచంమీద చతికిలబడి కవరు విప్పి చదువసాగాడు రామసుబ్బయ్య.

భర్తకు ఎదురుగ్గా ఎత్తు పీటమీద కూర్చున్నది లక్ష్మీకాంతమ్మ. చెవుల్ని చేటలుగా చేసుకొని.

.... నాన్నగారికి,

క్షేమం. ఇంటిదగ్గర అంతా క్షేమమే నని భావిస్తాను. నిన్న మన కోటయ్యగారి నర్సయ్య సెంటర్లో కనబడి—మెరకచేను బేరం పెట్టావనీ, నేడో, రేపో బేరం పైసలవుతుందని చెప్పాడు. నా చదువు నిమిత్తం బంగారంలాంటి ఆ చేను అమ్మవద్దు. ఇప్పుడు త్వరపడి అమ్మినా, రేపు డబ్బు లున్నప్పుడు అల్లాంటి చేను కొనాలన్నా దొరకదు. అన్ని సదుపాయాలూ గల ఆచేనును అమ్ముకోవటం తెలివితక్కువే. అదీగాక ఇప్పుడు నాకు డబ్బు అవసరంలేదు. మెడిసిన్ పూర్తి చేయటానికి ఇకముందు మీరు నెల నెలా డబ్బు పంపనక్కరలేదు. ఇక్కడ నాకు గోపాల్ అనే ప్రాణస్నేహితుడున్నాడు. అతను లక్షాధికారి. నా చదువు కోసం పదివేలు ఇస్తానన్నాడు. ఇవాళే ఓ వెయ్యి రూపాయ లిచ్చాడు కూడాను. చదువు పూర్తిచేసి, ఉద్యోగం ద్వారానో, ప్రాక్టీసు పెట్టో ఆ డబ్బు ఇచ్చుకుంటాను. మళ్లీ నా దగ్గర్నుంచి పుచ్చుకునే పద్ధతిలో నా కివ్వలేదనుకో. అయినా అది ధర్మం గనుక ఆ ఉద్దేశ్యంతోనే, విశ్వాసంతోనే, ఆత్మ బలంతోనే డబ్బు తీసుకున్నాను. కాబట్టి నువ్వు మెరకచేను అమ్మవద్దు. నన్ను గురించి, నా చదువును గురించీ, నా భవిష్యత్తును గురించీ—ఎల్లాంటి దిగులూ, విచారమూ పెట్టుకోవద్దు. అమ్మ కులాసేగదూ ! అడిగానని చెప్పు.

—వెంకటరామారావు.

లక్ష్మీకాంతమ్మ ఆనందోత్సాహాలతో పరవశురాలై చివుక్కున ఎత్తుపీటమీద నుంచి లేచింది.

"ఎట్టాగైనా అబ్బాయి సమర్థుడు. మెరకచేనుమీద వాడి కెంత అభిమానం. ఆ చేను పంట యింకా మనకు ప్రాప్తముంది. ఎప్పటికీ మెరకచేను మనదే."

రామసుబ్బయ్యకు కళ్లల్లో నీళ్లు గుండ్రంగా తిరిగాయి. కొన్ని క్షణాలపాటు కొయ్యబారిపోయి కూర్చున్నాడు. నోట మాట రాలేదు. భార్య మాటలు మొనదేలిన బాణాల్లా పదునుగా గుచ్చుకున్నాయి.—మెత్తబడ్డ హృదయంతో.

'ఇంకెక్కడి మెరకచేను ? షావుకారు చంద్రశేఖరం పరమైపోయింది—పదివేలకు ....' అనుకున్నాడు రామసుబ్బయ్య దుఃఖంతో దురపిల్లుతూ.

భర్త ముఖంపై పచార్లుచేసే విషాద మేఘాల్ని చూసి—లక్ష్మీకాంతమ్మ నోటిమీద మున్వ్రేళ్లు పెట్టుకుని విస్తుపోయింది.

'.... ఛీ. ఛీ. ఈ ఉత్తరం నిన్న రాకూడదూ !' అనుకున్నాడు రామసుబ్బయ్య దుఃఖోన్మాదంతో.

ఆయన జేబులో షావుకారుగారిచేత బయనా క్రింద రవాణా కావించబడ్డ పదివందల రూపాయల నోట్లు '—ఈ నేరం మాదికాదు' అన్నట్టు చప్పుడు చేయకుండా పడుకున్నాయి. ★

ఒక పత్రికా విలేఖరి మరో పత్రికావిలేఖరితో "ఈ చిత్రంలో సెన్సార్ చాలా ఎక్కువగా కట్ చేశారని అన్నారు. ఎక్కడ కట్ చేశారో చిత్రంలో లే దే!"

రెండో పత్రికా విలేఖరి: పత్రికల వాళ్ళకు వేశారు కదూ ! అందుచేత దీనిలో తీసేసి వుంటారు. మిగిలిన ప్రింట్సులో వుంటాయటలే !

యం. ఇందిరా (మద్రాసు)